క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలిరూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా తెనాలి పట్టణం, మండల గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏడీఈ బి.అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

తెనాలి అర్బన్ : విద్యుత్ లైన్ల మరమత్తుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణం, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తెనాలిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగ పర్చుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి కేపీ బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. మే 11వ తేదీన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అవడం ద్వారా కక్షిదారులకు ఆర్థిక పరంగానూ వెసులుబాటు కలుగుతుందని, కోర్టుల్లో ఉన్న కేసులనూ రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కేసుల లిటిగేషన్ విపరీతంగా పెరగడం వల్ల వాటిని పరిష్కరించే దిశగా లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సివిల్ కేసులు ఏ దశలో ఉన్నా పరిష్కరించుకోవచ్చని సూచించారు. రాజీ కాదగిన సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్, వాహనాలు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. ప్రజలందరూ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవచ్చన్నారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి



కొల్లిపర : విద్యార్థులకు ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధన అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, అలాంటి ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈవో1 సాల్మాన్‌రాజు, ఎంఈవో2 ఝాన్సీలత అన్నారు. గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన పి.మృత్యుంజయరావు, షేక్ నూర్జహాన్ ను శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో తోటి ఉపాధ్యాయులు సత్కార సభ నిర్వహించారు. ఈ సభలో ఎంఈవోలు పాల్గొన్ని వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో కుటుంబరెడ్డి , ఉపాధ్యాయులు కె.బెనహర్, రవితేజ, సదాలక్ష్మి, దేవి, సుగుణకుమారి, బండి ప్రభుదాసు, కేదార్‌నాద్, సాయిబాబు పాల్గొన్నారు.

పేదలకు శ్రీ కాళీకామాత ఆలయ కమిటీ అన్నదానం



తెనాలి అర్బన్ : శ్రీ కాళీకామాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్ మాట్లాడుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాలుగు సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వై.శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు మేక సురేష్, కందేపి సీతారామయ్య, నీరంజన్, సుబ్బారావు, అడపాల శ్రీనివాసరావు, పి.రామకృష్ణ, సిహెచ్.హనుమంత్, పి.వెంకట్రావు, సుంకర రాజాబాబు, నక్కా వెంకటేశ్వర్లు, డాకా అంకిరెడ్డి పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

తెనాలి రూరల్ : నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో అధికారులు కేసు నమోదు చేశారు. తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తెనాలి మండలం కొలకలూరు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యక్తి వద్ద 13 క్వార్టరు మద్యం సీసాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

యువతి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: యువతి ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేళంగిణీనగర్ 7వ లైనుకు చెందిన మిరియాల ఝాన్సీరాణి (18) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతికి కారణాలు తెలియలేదని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేమంతా సిద్ధం కు వేలాదిగా తరలిన అభిమానులు



కరెవరంలో బస్సు ఎదుట పార్టీ నేతలు



జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ



నందివెలుగులో జెండా ఊపుతున్న సర్పంచి పవన్‌కుమార్



బస్సును స్వయంగా నడుపుతున్న అన్నాబత్తుని సత్యనారాయణ



బస్సులో వెళుతున్న 13వ వార్డు పార్టీ నేతలు, కార్యకర్తలు



బస్సులో తరలివెళుతున్న పట్టణ 24వ వార్డు అభిమానులు

గుంటూరులోని ఏటుకూరు రోడ్డు వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న మేమంతా సిద్ధం బహిరంగ సభకు తెనాలి నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలివెళ్లారు. నియోజకవర్గం నుంచి మొత్తం 150 బస్సుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. మరో వందకు పైగా కార్లలో బయలుదేరి వెళ్లారు. తెనాలి, అంగలకుదురులో మేమంతా సిద్ధం బహిరంగసభకు వెళుతున్న బస్సులకు స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పెద్ద కుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. తాను స్వయంగా కొద్దిసేపు బస్సు నడిపి యువతను ఉత్సాహపరిచారు. వీరితో పార్టీ యువనేతలు చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఉడుముల మహేష్‌రెడ్డి, రెడ్రౌతు బాలరాజు ఉన్నారు. – తెనాలి

మీ ఇంటి వద్దకే పింఛన్ వచ్చేలా చేస్తా

మా బాబు పేరు నబీ. వయస్సు 12 సంవత్సరాలు, పుట్టుకతోనే అంగవైకల్యంతో జన్మించాడు. మాటలు రావు, నడవలేని స్థితి .చిన్ననాటి నుంచి అన్నీ మంచంలోనే. మా బాబు చేతి వేలిముద్రలు బయోమెట్రిక్, ఐరిష్ పడకపోవడంతో పింఛన్‌కు అర్హత ఉన్నా పింఛన్ అందడంలేదని సీఎం జగన్ మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించగా, వెంటనే స్పందించి మీ బాబుకు పింఛన్ ఇంటికే వచ్చే విధంగా చేస్తానని మాట ఇచ్చారు. మమ్మల్ని కలిసి నందుకు ధన్యవాదాలు.

– నిమ్మలకాయల బాజీ, తొండపి.

ఆరోగ్యానికి భరోసా

మా బాబు పేరు త్రివేణు. వయస్సు 14 ఏళ్లు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎముకల్లో కాల్షియం సరైన మోతాదులో లేకపోవడంతో నడవలేని స్థితి. ఒళ్లంతా మంటలు వస్తాయి. పలు ఆసుపత్రులలో చూపించాం. ఆర్థిక స్థితి బాగోలేక వైద్యం అందించలేక పోతున్నాం, ఆదుకోవాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసాం. ఆదుకుంటానని మా బాబు ఆరోగ్యానికి భరోసా ఇచ్చారు.

– ఓమూరి శ్రీనివాసరావు, మాదల

ఇంటర్ పరీక్షల్లో వివేక విద్యార్థుల విజయదుందుభి

- ఇంటర్ సెకండియర్, ఫస్టియర్‌లోనూ అగ్రగామి మార్కుల సాధన
- ఆర్ట్స్ గ్రూపులోనూ సత్తా చాటిన వివేక విద్యార్థులు
- అభినందన సభలో వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో వీరనారాయణ, రామరాజు, వెంకటరత్నం

తెనాలి : ఇంటర్మీడియట్ పరీక్షల్లో స్థానిక వివేక విద్యాసంస్థల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ, జూనియర్ ఇంటర్ ఎంపీసీ/ఎంఈసీ గ్రూపుల్లోనూ రాష్ట్రస్థాయి మార్కులు సాధించినట్టు వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ వెల్లడించారు. వివేక మహిళా జూనియర్ కాలేజిలో శుక్రవారం విద్యార్థుల అభినందన సభలో వివరాలను తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో కె.శ్రీహాసిని 990/1000 మార్కులతో రాష్ట్రస్థాయిలో వివేక కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేశారని తెలిపారు. ఆర్ ఎస్ చంద్రికాంజలి, వైష్ణవిలు 988 మార్కులు, కె.అనుదీప్తి, ఎస్.సిరివెన్నెల 987, సీహెచ్ స్నేహ, వెంకటలు 986, షేక్ రహానా సమీన్ 985 మార్కులు సాధించారని, మొత్తం 15 మంది విద్యార్థులు 980 పైగా మార్కులతో ఉత్తీర్ణులైనట్టు చెప్పారు. జూనియర్ ఇంటర్‌లో దుర్గాప్రసాద్, కబీర్‌ఖాన్‌లు 464/470 మార్కులు, ఆర్ట్స్ గ్రూపులో సీహెచ్ గురులావణ్య రాష్ట్రస్థాయిలో 490/500 మార్కులతో ఉత్తీర్ణులైనట్టు చెప్పారు.సీనియర్ ఇంటర్‌లో 45 మంది 95 శాతంపైగా, 135 మంది విద్యార్థులు 90 శాతం పైగా మార్కులు సాధించటం గర్వకారణమన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వివేక విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ కె.రామరాజు, గుత్తా వెంకటరత్నం సత్కరించారు. సీఈవో ఉదయ్‌కిరణ్, వివేక మహిళా కాలేజి ప్రిన్సిపాల్ జ్యోతి, కో–ఆర్డినేటర్ షహనాజ్ బేగం, ఐఐటీ డీన్ ఎన్.శ్రీనివాస్, వాసంతి, మురళి, రాంబాబు, బాబూరావు, ఠాగూర్, రాజేష్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో తెనాలి విద్యార్థుల ప్రభంజనం



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఎన్ఆర్ఐ సీఈఓ ఉమామహేశ్వరరావు



విజయసంకేతనం చూపుతున్న విద్యార్థులతో చైతన్య ప్రిన్సిపల్ తిరుపతిరావు

తెనాలి అర్బన్: ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో తెనాలి పట్టణంలోని పలు ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో అత్యధిక మార్కులు సాధించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలకు చెందిన జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470, 465 మార్కులు ఐదుగురు విద్యార్థులు సాధించారని కళాశాల సీపీవో సిహెచ్.ఉమామహేశ్వరరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 440 మార్కులుగాను 430 మార్కులు ముగ్గురు, 425 మార్కులు ఏడుగురు సాధించినట్లు చెప్పారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 988 మార్కులు, సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగం 973 మార్కులు సాధించి ప్రథమస్థానం నిలిచారన్నారు. వీరందరిని కళాశాల ఆవరణలో శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ ఎస్.శివన్నారాయణ, కె.కృష్ణారెడ్డి, పి.కిషోర్ బాబు, ఎల్.మల్లీశ్వరి, కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

■ శివాజీచౌక్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థి ఉమానాగమహేంద్ర 987 మార్కులు, ఎస్.నవ్య 986 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ వి.తిరుపతిరావు తెలిపారు. అలాగే మంచి మార్కులు సాధించిన విద్యార్థులు కళాశాల ఆవరణలో అభినందించారు.



రాజేశ్వరి(461)

■ రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో 94 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కె.రాజేశ్వరి 461, 400కు పైగా 28 మంది విద్యార్థులు మార్కులు సాధించారని చెప్పారు. సీనియర్ ఇంటర్ విభాగంలో ఎ.శ్రీనివాస్ 921, 900లకు పైగా 48 మంది విద్యార్థులు మార్కులు సాధించారని వివరించారు. వీరందరిని కళాశాల ఆవరణలో అభినందించారు.

■ ఇంటర్ వృత్తి విద్య కోర్సు ఫలితాల్లో నాజర్‌పేటలోని సెయింట్ పాల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించారని ప్రిన్సిపల్ ఎంఏ.లింకన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. డైరీయింగ్ కోర్సులో డి.హేమిమా 550మార్కులకు గాను 458 మార్కులు, నర్సింగ్ కోర్సులు ఎం.కీర్తి 445 మార్కులు సాధించినట్లు చెప్పారు. వీరందరిని కళాశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి షీలా సుజని, ఎం.కీర్తి అబ్రహం పాల్గొన్నారు.

పటిష్టంగా స్ట్రాంగ్ రూంల ఏర్పాటు

- అధికారులకు తూర్పు ఆర్వో కీర్తి చేకూరి ఆదేశం
- ఏసీ కాలేజిలో స్ట్రాంగ్ రూమ్స్ ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్, తూర్పు ఆర్వో కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎంల స్ట్రాంగ్ రూంలను ఎన్నికల సంఘం నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా సిద్ధం చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కీర్తి చేకూరి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ అయిన ఏసీ కాలేజిలో శుక్రవారం స్ట్రాంగ్ రూమ్స్ ఏర్పాట్లను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలేజీ మెయిన్ గేటు నుంచి స్ట్రాంగ్ రూం, పరిసరాలు, ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీసీ కెమెరాల సెంట్రల్ మోనిటరింగ్ విభాగం అబ్జర్వర్ రూంలో ఉండాలని తెలిపారు. కెమెరాల రికార్డ్‌ను ప్రత్యేకంగా హార్డ్ డిస్క్‌లో ఏ రోజుకి ఆ రోజు స్టోర్ చేయాలని చెప్పారు. రికార్డింగ్‌లో విద్యుత్, సాంకేతిక లోపాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, దీన్ని ఏఈ బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూం పరిసరాల్లోకి వర్షం నీరు లోపలకు రాకుండా చర్యలు తీసుకోవాలని ఏఈకి సూచించారు. రూంలో ప్రతి ఈవీఎంకు మార్కింగ్ ఇవ్వాలని సర్వేయర్‌ని ఆదేశించారు. పర్యటనలో ఏఆర్ఓలు సునీల్, ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ మధుసూదన్, ఈఈలు సుందరరామిరెడ్డి, శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ విద్యార్థికి బంగారు పతకం ప్రదానం



తెనాలి అర్బన్ : క్రమశిక్షణతో కూడిన విద్యను అందరూ అలవాటు చేసుకోవాలని ఎంఈవో–1 మేకల లక్ష్మీనారాయణ సూచించారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ పరీక్షల్లో గోల్డ్ మెడల్ సాధించిన పదో తరగతి విద్యార్థి పల్లెకొండ ఆనంద్‌కుమార్ అభినందన సభను చెంచుపేటలోని చైతన్య స్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. విద్యార్థికి మెడల్, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.మాధురి, విద్యార్థి తండ్రి రవికుమార్, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానది దిగువ ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు కనుగొన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ రమేష్ సంఘటనా స్థలానికి వెళ్లి నీటిలో వున్న మృతదేహాన్ని వెలికితీశారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ ఎవరో గుర్తుతెలియన మహిళ కనకదుర్గ వారధిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావిస్తున్నామని, మృతురాలి వద్ద నుంచి ఎటువంటి వివరాలు లభించలేదని, మృతురాలి దేహంపై లైట్ బ్లూకలర్ చీర, పైన గోల్డ్ కలర్ అడ్డగీతలు, ఎర్రపూలు ఉన్నాయని, ఒంటిపై రోల్డ్ గోల్డ్ చైన్, గాజులు, కమ్మెలు ధరించి ఉందన్నారు.

భక్తిరస రాముని కీర్తనలకు హృద్యమైన నృత్యం



నృత్యాంశ ప్రదర్శనలో చిన్నారులు

తెనాలి : పట్టణ నాజరుపేట కొల్లూరు వారి వీధిలో గల శ్రీసీతారామాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీక్రోధి నామ సంవత్సరం ఆరంభమైన ఈనెల 9వ తేదీనుంచి 40వ వసంత నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుపుతున్నారు. శ్రీస్వామివారికి నిత్యార్చనలతోపాటు గాత్ర కచేరీలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, కోలాటాలు, పాటలు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు.గురువారం రాత్రి కళ్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరిగాయి. అకాడమీ అధినేత, ప్రముఖ నృత్యగురువు డాక్టర్ చల్లా బాలత్రిపురసుందరి శిష్యబృందమైన 36 మంది చిన్నారులు వివిధ నృత్యాంశాలను ప్రదర్శించారు. అవన్నీ భక్తి రస రాముని కీర్తనలే కావటం విశేషం. చిన్నారుల నృత్యాభినయాన్ని భక్తులు, ఆలయ కమిటీ బాధ్యులు అభినందించారు.

దోమల నియంత్రణపై అవగాహనా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ప్రభాకర్‌రెడ్డి, ఉమాకాంత్, తదితరులు

తెనాలి అర్బన్ : దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన పెంచుకోవాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని హడ్కో కాలనీలో దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న పాత వస్తువుల్లోని నీటిని తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని చెప్పారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఉన్న నీరు దోమలకు అవాసాలని తెలిపారు. దోమకాటు వల్ల విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, బోధకాలు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లీశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏటుకూరుకు భారీగా తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కొల్లిపర : గుంటూరు తూర్పు మండలంలోని ఏటుకూరు బైపాస్ వద్ద ఏర్పాటు చేసి మేమంతా సిద్ధం సభకు శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలోని 20గ్రామాలనుండి 50 బస్సులు, 30 కార్ల ద్వారా సుమారు 3000 వేల మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. మరికొంత మంది తమ సొంత వాహనాల్లో వారి కుటుంబసభ్యులతో సిద్ధం సభకు బయలుదేరారు. సభకు వెళ్లలేని పార్టీ అభిమానులు కొంత మంది ఇళ్ల వద్దే పోన్‌లో యూట్యూబ్‌లో , టీవీల్లో కార్యక్రమాన్ని తిలకించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు పద్మావతి



రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు పద్మావతి

కొల్లిపర : అంగన్ వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు, బాలింతలకు ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తున్న ఆకుకూరలు, పౌష్టికాహారం, ఐరన్ మాత్రలు క్రమం తప్ప కుండా తీసుకోవాలని రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండల కేంద్రం కొల్లిపరలో హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం స్థానిక ఎంఈవో1, 2 సాల్మన్‌రాజు, ఝాన్సీలత తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తున్న పౌష్టికాహారం ఇస్తున్నారా లేదా అని గ్రామంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, చిన్నారులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ ను వినియోగిస్తున్నారని, వాటి వల్ల గర్భిణీలలో, చిన్నారుల్లో రక్తహీనత నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగమణి, సీఆర్‌పీ పిడపర్తి రమేష్‌బాబు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు కీళ్ల వ్యాధుల ఉచిత వైద్య సలహా శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ప్రతి నెలా రెండో ఆదివారం నిర్వహిస్తున్న స్పెషలిస్టుల ఉచిత వైద్య శిబిరంలో భాగంగా ఆదివారం కీళ్ల వ్యాధుల ఉచిత వైద్య సలహా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయా సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి. సేవ కుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు బ్రాడీపేట 2/1లోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో నిర్వహించే సలహా శిబిరంలో రుమటాయిడ్ ఆర్థరైటిస్, గౌట్, లూపస్ ఎరతమేటస్, ఏక్సైల్లోజింగ్ స్పాండిలైటిస్, స్కైరో డెర్మ, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలపై ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష రాజవరపు ప్రసంగంతో పాటు వైద్య సలహాలు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.